సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



ఎన్‌కౌంటర్‌కు ఎనిమిదేళ్లు
మోత్కూరు మండలం జానకిపురంలో ఎన్‌కౌంటర్ జరిగి మంగళవారంతో ఎనిమిదేళ్లు పూర్తయ్యాయి. -8లో



అటకెక్కిన యాదాద్రి మాస్టర్ ప్లాన్
యాదాద్రి ఆలయ అభివృద్ధిలో భాగంగా పెద్దగుట్టపై ఏర్పాటు చేస్తున్న టెంపుల్ సిటీ చిట్టడవిని తలపిస్తోంది. -10లో

గరిష్ఠం/కనిష్ఠం 37°/24°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



న్యూస్‌రీల్

శివాలయంలో పూజలు



స్పటిక లింగానికి హారతినిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం విశేష పూజలు జరిగాయి. శ్రీస్వామి వారికి నిత్యపూజలు చేసిన అనంతరం మండపంలో నిత్య రుద్రహవనం, అభిషేకం, అర్చనలు చేశారు. ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు నిర్వహించి హారతినిచ్చారు. అదే విధంగా యాదాద్రీశుడికి నిత్య కైంకర్యాలు శాస్త్రోక్తంగా చేపట్టారు.

మోటకొండూర్ ఉప సర్పంచ్‌గా భాగ్యలక్ష్మి



నియామక పత్రం అందజేస్తున్న ఎంపీఓ కిషన్

మోటకొండూర్ : మోటకొండూర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నికను సోమవారం ఎంపీడీఓ వీరస్వామి సమక్షంలో నిర్వహించారు. పాలకవర్గంలో 12 మంది వార్డు సభ్యులు, సర్పంచ్ ఉండగా బుగ్గ భాగ్యలక్ష్మికి ఏడుగురు వార్డు సభ్యులతో పాటు సర్పంచ్ మద్దతు తెలిపారు. అధికారులు భాగ్యలక్ష్మికి నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కిషన్, సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత, వార్డు సభ్యులు కాంబోజు నాగరాజు, వంగాల స్వరూప, జంగవెల్లి జహంగీర్, బీరకాయల మల్లేష్, జంపాల సత్తమ్మ, మోకాళ్ల కవిత ఉన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



వంకమామిడికి చెందిన ఇరుకు సుష్మకు ఆర్థిక సహాయం అందజేస్తున్న సామ రవీందర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : పంజాబ్‌లో ఈ నెల 5 నుంచి జరగనున్న జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు భూదాన్‌పోచంపల్లి మండలంలోని వంకమామిడి గ్రామానికి చెందిన ఇరుకు సుష్మ ఎంపికయ్యారు. రవాణా ఖర్చుల నిమిత్తం ఆమెకు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సామ రవీందర్‌రెడ్డి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దోతిగూడెం సర్పంచ్ పగిళ్ల స్వప్న రాంరెడ్డి, నాయకులు బొడిగె మల్లయ్య, వనం లింగస్వామి, సుర్వి కుమారస్వామి, మచ్చ యాదగిరి, మచ్చ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి ఇంటింటికీ సీపీఐ



మాట్లాడుతున్న గోద శ్రీరాములు

గుండాల : ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఈ నెల 14 నుంచి జిల్లాలో ఇంటింటికీ సీపీఐ పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు వెల్లడించారు. సోమవారం గుండాల మండలం సుద్దాల గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఆత్మీయ సమ్మేళనాలు ఆ పార్టీ ప్రయోజనాలకే తప్ప.. పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలం అయ్యారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో సీపీఐ దిక్సూచి అవుతుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, హరిశ్చంద్ర, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణచారి, ఏసోఫ్, స్వామి, కృష్ణచారి, కొమురయ్య పాల్గొన్నారు.

పరిహారం రూ. సున్నా!

ఆస్తి విలువ నిర్ధారణలో అధికారుల అలసత్వం
- ముంపు ఇళ్ల లెక్కలన్నీ తప్పుల తడక
- రికార్డుల్లో రూ.సున్నా, 6 వేలు, 65 వేలుగా నమోదు
- అయోమయంలో నిర్వాసితులు
- సరిచేయకపోతే నష్టం జరిగే అవకాశం



ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపూర్

సాక్షి, యాదాద్రి : నృసింహ రిజర్వాయర్ (బస్వాపురం) నిర్వాసితుల పరిహారం పరిహాసంగా మారింది. ఆస్తి విలువను నిర్ధారించడంలో అధికారులు నిర్లక్ష్యం గందరగోళానికి గురి చేస్తోంది. ముంపు ఇళ్లకు రూ.సున్నా, రూ.6 వేలు, రూ.6113, రూ.65 వేలుగా నెట్ వ్యాల్యూ నిర్ధారించడంతో అది చూసి నిర్వాసితులు అయోమయంలో ఉన్నారు. సోమవారం కలెక్టరేట్‌కు వెళ్లి ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. తక్షణమే సరి చేయకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ఏం జరిగిందంటే..
ముంపు బాధిత గ్రామాలైన బీఎన్ తిమ్మాపూర్, లప్పానాయక్‌తండా, చోక్లాతండా ప్రజలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంది. ఇటీవల బీఎన్ తిమ్మాపూర్ గ్రామస్తులకు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఒక్కో కుటుంబానికి రూ.7.61 లక్షల చొప్పున చెల్లించారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో లేఅవుట్ కూడా సిద్ధం చేస్తున్నారు. అయితే ముంపు గ్రామంలో కోల్పోతున్న ఇళ్లు, వాటి పరిధిలో ఉన్న నీటి వనరులు, చెట్లు ఇతర ఆస్తిపాస్తులను ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు లెక్కించి నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా బీఎన్ తిమ్మాపూర్‌లోని 793 ఇళ్లకు పరిహారం సుమారు రూ.75 కోట్లుగా నిర్ధారించారు. ఇంత వరకు బాగానే ఉన్నా నిర్వాసితులకు నిర్ధారించిన పరిహారం వివరాలు రికార్డుల్లో తప్పుల తడకగా ఉన్నాయి. గ్రామంలోని పిన్నం పాండుకు చెందిన రేకుల ఇంటికి నెట్ వాల్యూ రూ.00గా నమోదైంది. అదే గ్రామానికి చెందిన వల్లందాస్ నరేష్‌కుమార్ ఇంటికి రూ.6113గా రికార్డుల్లో చూపిస్తోంది. ఇంకా పలు ఇళ్లకు లెక్కల ప్రకారం తక్కువ పరిహారం వచ్చిందని బాధితులు వాపోయారు. ఈ విషయమై వారు సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.

లప్పానాయక్‌తండాకు ఏదీ ప్యాకేజీ?
యాదగిరిగుట్ట మండలం లప్పానాయక్‌తండాకు పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ఇంకా అందడంలేదు. 250 కుటుంబాలకు రూ.7.61 లక్షల చొప్పున రూ. 19.04 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం సుమారు 20 రోజులుగా నృసింహసాగర్ రిజర్వాయర్ కట్టపై దీక్ష చేస్తున్నారు. వీరికి పరిహారం ఇవ్వడంతోపాటు దాతరుపల్లి సమీపంలో గల 30 ఎకరాల ప్రభుత్వ భూమిని లే అవుట్ చేసి నిర్వాసిత కుటుంబాలకు ప్లాట్లు ఇవ్వడానికి అధికారులు నిర్ణయించారు. అయితే ముందుగా పరిహారం చెల్లించాలని వారు ఆందోళన చేస్తున్నారు.

సరిచేయకపోతే ఆందోళన
భువనగిరిటౌన్ : బీఎస్ తిమ్మాపురంలో ముంపు ఇళ్లకు నిర్ధారించిన విలువలో అవకతవకలు జరిగాయని, వెంటనే సరి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తప్పులను సరి చేయాలని కోరుతూ నిర్వాసితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్ట్రక్చర్ వ్యాల్యూను నిర్ధారించడంలో అధికారులు అలసత్వం వహించారని, తద్వారా పరిహారం చెల్లింపులో తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. బాధితులకు రూ.6 వేలు, సున్నా, రూ.60వేలు ఇలా అతి తక్కువగా నమోదు కావడంతో నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా పునరావాసం కోసం కేటాయించిన లే అవుట్‌లో సదుపాయాలు కల్పించడంతో పాటు నిర్వాసితులకు ప్లాట్లు కేటాయించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడుతామన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న నారాయణరెడ్డి



భువనగిరి : పరీక్ష కేంద్రంలోకి వెళ్లేందుకు లైన్‌లో నిల్చున్న విద్యార్థులు

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

భువనగిరి : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు తెలుగు పరీక్ష నిర్వహించారు. 8,986 మంది విద్యార్థులకు గాను 8,970 మంది హాజరయ్యారు. 16 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థుల వెంట వారి తల్లిదండ్రులు, బంధువులు రావడంతో కేంద్రాల వద్ద సందడి నెలకొంది. రామన్నపేటలో పరీక్ష కేంద్రాలను కలెక్టర్ పమేలా సత్పతి తనిఖీ చేశారు. భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ఉన్నత పాఠశాల కేంద్రం వద్ద విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. డీసీఎంలో మన ఊరు – మన బడి సామగ్రి రావడం.. ఇదే సమయంలో విద్యార్థులు పరీక్ష కేంద్రంలోకి వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు.



రామన్నపేట : పరీక్ష హాల్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

అడ్డగూడూరు : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాని తద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని స్త్రీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కృష్ణవేణి సూచించారు. అడ్డగూరులోని రైతుల వేదిక భవనంలో సోమవారం నిర్వహించిన పోషణపక్వాడా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలితలు, చిన్నారుల కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసనం చేయించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సునీతభట్, నర్సింహారావు, ఎంపీపీ దర్శనాల అంజయ్య, ఎంపీడీఓ చంద్రమౌళి, సర్పంచ్‌లు నిమ్మనగోడి జోజి, కుమారస్వామి, సత్తయ్య, సీడీపీఓ జ్యోత్స్న, సూపర్‌వైజర్ మధురమ్మ, ఎంపీఓ ప్రేమలత, ఎంపీటీసీ వెంకటయ్య పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి



కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

భువనగిరిటౌన్ : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతిని సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ పమేలా సత్పతితో పాటు పలువురు అధికారులు కొమురమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయుధ పోరాటంలో ఆయన చూపిన తెగువను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, బీసీ సంక్షేమ అధికారి యాదయ్య, కలెక్టరేట్ ఏఓ నాగేశ్వరాచారి, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు గవ్వల నర్సింహులు, ప్రతినిధులు జూకంటి రవీందర్, కొత్త నర్సింహచారి, కాదూరి అచ్చయ్య, ఏశాల అశోక్, తొటకూర బీరయ్య పాల్గొన్నారు.

జగ్జీవన్‌రాం జయంతిని జయప్రదం చేయాలి
ఈ నెల 5న బాబూ జగ్జీవన్‌రాం 116వ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగి పట్టణంలోని రైతుబజార్ ఎదురుగా ఉన్న జగ్జీవన్‌రాం చౌరస్తాలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. దళిత సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఆస్తి పన్నుపై ఆఫర్!

- ముందుస్తుగా చెల్లిస్తే 5శాతం రాయితీ
- ఈనెల 30 వరకు అవకాశం
- ఆరు మున్సిపాలిటీల్లో అమలు

భువనగిరిటౌన్ : ముందస్తు పన్నుల వసూళ్లపై మున్సిపల్ యంత్రాంగం దృష్టి సారించింది. 2023–24 ఆర్థిక సంవత్సరం ఆరంభం మాసంలో 30వ తేదీ వరకు పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ప్రకటించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను వసూళ్ల మార్చి 31తో ముగిశాయి. నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో గత ఏడాదిలాగే ఈ సారి కూడా ఎర్లీ బర్డ్ పథకం అమలు చేస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బకాయిలు పేరుపోకుండా ముందస్తు పన్ను చెల్లింపులను ప్రోత్సహించడమే ఎర్లీబర్డ్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

ఆరు మున్సిపాలిటీల్లో 'ఎర్లీబర్డ్'
జిల్లాలోని భువనగిరి, ఆలేరు, మోత్కురు, భూదాన్ పోచంపల్లి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట మున్సిపాలిటీల్లో ఎర్లీబర్డ్ పథకాన్ని అమలు చేస్తున్నారు. 2022 –23 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను పూర్తిగా చెల్లించిన వారితో పాటు బకాయిలను ఫెనాల్టీతో కట్టిన వారికి మాత్రమే ఐదు శాతం రాయితీ వర్తించనుంది. రాయితీ పొందాలంటే ఏప్రిల్ 30లోగా ఆయా మున్సిపల్ కార్యాలయాల్లో, సీడీఎంఏ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించడానికి అవకాశం ఉంది.



భువనగిరి మున్సిపల్ కార్యాలయం

గత ఆర్థిక సంవత్సరం చేరని లక్ష్యం
జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను గత ఏడాది కంటే అధికంగా వసూలైనప్పటికీ ఏ ఒక్క చోట లక్ష్యం చేరలేదు. భువనగిరిలో 75.94, మోత్కూరు 90.67, భూదాన్‌పోచంపల్లి 68, చౌటుప్పల్ 72, ఆలేరులో 68.83 శాతం పన్నులు వసూలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదాయాన్ని పెంచుకోవడానికి మున్సిపల్ శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. ఎర్లీబర్డ్ పథకంపై ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ప్రచారం కల్పించనున్నారు.

ఐదు శాతం రాయితీకి అర్హులు

మున్సిపాలిటీ	అసెసిమెంట్లు	అర్హులు
భువనగిరి	14,148	9,000
మోత్కూరు	4,705	4,102
పోచంపల్లి	4,600	2,000
చౌటుప్పల్	8,038	6,538
యాదగిరిగుట్ట	4,700	1,562
ఆలేరు	4,677	3,200

సద్వినియోగం చేసుకోవాలి



"ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి మున్సిపల్ శాఖ కల్పించిన 5 శాతం రాయితీ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని. ఏప్రిల్ 30వ తేదీ వరకు మున్సిపల్, రెవెన్యూ కార్యాలయాల్లో లేదా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు.వివరాల కోసం 90146 86140 సంప్రదించాలి.
–నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ క్రైం డీసీపీ అనురాధ

భూదాన్‌పోచంపల్లి : సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని రాచకొండ కమిషనరేట్ సైబర్ క్రైం డీసీపీ డాక్టర్ అనురాధ పేర్కొన్నారు. సోమవారం భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలోని సెయింట్ మేరీస్ ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలు– మహిళల భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెక్నాలజీతో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి సైబర్ వేధింపులు, బెదిరింపులకు పాల్పడిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లో తమ బ్యాంకు, ఆధార్ వివరాలు, వ్యక్తిగత సమాచారం ఇవ్వద్దన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు, ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్, లేదా ఏదేని సైబర్ నేరాలు జరిగిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని పేర్కొన్నారు.ఏసీపీ ఉదయ్‌రెడ్డి, సైబర్ క్రైం ఏసీపీ వెంకటేశం సైబర్ మోసాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ మేరీస్ విద్యా సంస్థల ఫౌండర్ చైర్మన్ కేవీకే రావు, సెక్రటరీ శ్రీహర్ష, డైరెక్టర్ డాక్టర్ ఎం.సత్యనారాయణ, సీఐలు కిరణ్‌కుమార్, మహేశ్, ఎస్‌ఐ సైదిరెడ్డి, సైబర్‌క్రైమ్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనురాధ

మా ప్లాట్లు ఆక్రమించుకుంటున్నారు

- కలెక్టరేట్ ఎదుట బాధితుల ధర్నా

భువనగిరిటౌన్ : యాదగిరిగుట్ట పరిధిలోని పెద్దరెడ్డిగూడెం వద్ద ఉన్న హరిపురి టౌన్ షిప్‌లో కొనుగోలు చేసిన ప్లాట్లను కొంతమంది ఆక్రమించుకుంటున్నారని ఆరోపిస్తూ బాధితులు సోమవారం కలెక్టర్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. తాము తొమ్మిదేళ్ల క్రితం టౌన్‌షిప్‌లో ప్లాట్లు కొనుగోలు చేశామని, అప్పుడు స్థానిక అధికారులు ఎన్‌ఓసీ కూడా ఇచ్చి తమకు డాక్యుమెంట్ చేశారని తెలిపారు. ఇప్పుడు కొందరు ప్లాట్లను ఆక్రమించుకుంటున్నారని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందదించడం లేదన్నారు. ప్లాట్లు చూడడానికి వెళ్తే దాడి చేస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

'డబుల్ ఇళ్లు' మాకూ ఇవ్వండి

- ప్రజావాణికి క్యూ కట్టిన నిరుపేదలు
- అధికారులకు వినతులు అందజేత



ఇళ్లు కావాలని అధికారులకు అర్జీలు అందజేస్తున్న ప్రజలు

భువనగిరిటౌన్ : భువనగిరిలోని సింగన్నగూడెం వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు దక్కని నిరుపేదలు సోమవారం కలెక్టరేట్‌కు క్యూ కట్టారు. ప్రజావాణిలో అధికారులకు అర్జీలు అందజేసి గోడు వెల్లబోసుకున్నారు. ప్రతి వార్డులో 5 నుంచి 9 మంది వరకు అనర్హులకు ఇళ్లు కేటాయించారని పేర్కొన్నారు. గతంలో భర్తల పేరు మీద ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన వారికి.. ప్రస్తుతం వారి భార్యల పేరున డబుల్ బెడ్ రూం ఇళ్లు వచ్చాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.అర్హతలు కలిగిన తమకూ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని వేడుకున్నారు. గ్రీవెన్స్‌లో 100 వరకు వినతులు రాగా అందులో సగం డబుల్ బెడ్ రూం ఇళ్లకోసం వచ్చినవే ఉన్నాయి. రెవెన్యూకు సంబంధించిన 44 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. డీఆర్‌డీఏ ఉపేందర్‌రెడ్డి, డీపీఓ సునంద, కలెక్టరేట్ ఏఓ నాగేశ్వరాచారి వినతులు స్వీకరించారు.

వినతులు ఇలా..
- భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని పహాడీనగర్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ముస్లిం మైనార్టీలు 30 మంది డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం అర్హత సాధించగా చివరికి ఇద్దరికి మాత్రమే ఇళ్లు వచ్చాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ మజహార్ తెలిపారు. మరికొంతమందికి ఇళ్లు మంజూరు చేయాలని అధికారులకు విన్నవించారు.
- ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అతహార్ వినతిపత్రం అందజేశారు.
- డబుల్ బెడ్ రూం ఇళ్లకు లక్కీ డ్రా దివ్యాంగుల కోటాలో తీయకుండా జనరల్ కేటగిరీలో తీశారని, దీంతో వారికి అన్యాయం జరిగిందని భువనగిరికి చెందిన శ్రీపాద ఆనంద్‌కుమార్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.
- భువనగిరిలో 6,18వ వార్డుల్లో అనర్హులకు ఇళ్లు కేటాయించారని పలువురు విన్నవించారు.జాబితాలో పేర్లు ఉన్నా డ్రాలో రాలేదని, న్యాయం చేయాలని కోరారు.
- కలెక్టరేట్ ఆవరణలో పార్కింగ్ చేసిన తన బైకఅపహరణకు గురైందని భువనగిరికి చెందిన ఎడమ మధు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 31వ తేదీన ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో పని నిమిత్తం వచ్చానని, బయటకు వచ్చి చూగా బైక్ కనిపించలేదన్నారు. ఆ సమయంలో సీసీ పుటేజీలు కూడా పని చేయలేదన్నారు. తన బైక్ (ఏపీ 24ఏఎల్ 1485) దొరికేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీటితో పాటు మరికొందరు వినతి పత్రాలు అందజేశారు.



ఇళ్లు రాలేదని ఫిర్యాదు చేయడానికి వచ్చిన భువనగిరిలోని 18వ వార్డు ప్రజలు

ఇక.. సాఫీగా ప్రయాణం!

- రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న భువనగిరి అర్బన్ కాలనీవాసులు
- రైల్వే గేట్‌తో తొలగనున్న కష్టాలు



నిధుల మంజూరు ఉత్తర్వుల ప్రతులను చూపుతున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, అర్బన్ కాలనీవాసులు

భువనగిరి : దశాబ్దాల తరబడి రైల్వే గేట్ కారణంగా ఇబ్బందులు పడుతున్న భువనగిరిలోని అర్బన్ కాలనీవాసుల సమస్య త్వరలోనే తీరనుంది. అతిపెద్ద కాలనీగా పేరుపొందిన ఈ కాలనీలో సుమారు 2,500 గృహాలు, 7,500 వేల జనాభా ఉంంది. కాలనీకి చెందిన వందలాది మంది ఉద్యోగం, వ్యాపారాలు, విద్యాపరంగా వివిధ ప్రాంతాలకు వెళ్లొస్తుంటారు. అయితే పట్టణానికి, కాలనీకి మధ్య సికింద్రాబాద్ – కాజీపేట రైల్వే మార్గం ఉంది. రెండు రైల్వే లైన్లు ఉండడంతో ఈ మారంగంలో నిత్యం రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. రైలు వెళ్లిన ప్రతి సారి గేట్ పడుతుండడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు, విద్యార్థులతో పాటు వివిధ పనుల నిమిత్తం వెళ్లే వారు సకాలంలో చేరుకోలేకపోతున్నారు. అంతేకాకుండా అతవ్యసర పనులపై, ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రులకు వెళ్తున్న వారు అర్ధగంట వరకు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు పలుసార్లు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి విజ్ఞప్తులు అందజేశారు. చివరికి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి చొరవ చూపి రైల్వే అండర్‌పాస్‌కు రోడు నిర్మాణం కోసం చర్యలు తీసుకున్నారు.

కొనసాగుతున్న భూ సేకరణ
అర్బన్ కాలనీకి వెళ్లేందుకు రైల్వే గేట్‌నుంచి కాకుండా కిసాన్‌నగర్‌లోని రైల్వే అండర్‌పాస్ నుంచి చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం 30 ఫీట్ల వెడల్పు, 700 మీటర్ల పొడువ రోడ్డు నిర్మాణానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుతం భూ సేకరణ ప్రక్రియ కొనసాగుతుంది. భూ సేకరణతో పాటు రోడ్డు నిర్మాణానికి సోమవారం హెచ్‌ఎండీఏ రూ.2 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిధులు మంజూరవడంతో టీఆర్‌ఎస్ నాయకులు, స్థానిక కౌన్సిలర్లు స్వీట్లు పంపిణీ చేసి బాణసంచాలు కాల్చి ఆనందం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

పిడుగు పడి గీత కార్మికుడికి గాయాలు

కనగల్: తాటిచెట్టుపై పిడుగు పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలోని రేగట్టే గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. రేగట్టే గ్రామానికి చెందిన గీత కార్మికుడు గుంటికాడి అంజనేయులు రోజు మాదిరిగా సోమవారం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ఒక్కసారిగా వడగళ్ల వానతో పాటు ఈదురుగాలులు రావడంతో అతడు ఎక్కిన చెట్టుపైనే పిడుగు పడింది. దీంతో అంజనేయులు కిందపడగా తల, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఆయనను నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


సతీష్‌రెడ్డి (ఫైల్)

మునగాల (కోదాడ): విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని నేలమర్రి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నేలమర్రి గ్రామానికి చెందిన మెండు గోపాల్‌రెడ్డి, జయమ్మ దంపతుల కుమారుడు మెండు సతీష్‌రెడ్డి(34) వరికోత మిషన్లను లీజుకు తీసుకొచ్చి నడిపిస్తుంటాడు. సతీష్‌రెడ్డి తండ్రి గతంలోనే మృతిచెందగా, తల్లితో కలిసి గ్రామంలోనే ఉంటున్నాడు. సోమవారం గ్రామ శివారులో వరి పొలం కోస్తుండగా వరికోత మిషన్‌కు 11కేవీ వైర్లు అడ్డు రావడంతో వాటిని కర్రతో పైకి లేపే ప్రయత్నం చేశాడు. దీంతో వైర్లు తెగి మీదపడడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి జయమ్మ ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి. లోకేష్ తెలిపారు.

జానకిపురం ఎన్‌కౌంటర్‌కు ఎనిమిదేళ్లు

- అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటన
- ఉగ్రవాదుల కాల్పుల్లో అమరులైన ఎస్‌ఐ సిద్దయ్య, కానిస్టేబుల్ నాగరాజు
- చివరకు ఉగ్రవాదులను మట్టుబెట్టిన పోలీసులు


ఎస్‌ఐ సిద్దయ్య, కానిస్టేబుల్ నాగరాజు (ఫైల్)


కాల్పుల్లో మృతి చెందిన ఉగ్రవాదులు అస్లాం అయూబ్, జాకీర్ బాదల్

మోత్కూరు: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మోత్కూరు మండలం జానకిపురం గ్రామంలో ఎన్‌కౌంటర్ జరిగి మంగళవారంతో ఎనిమిదేళ్లు పూర్తయ్యాయి. ఏప్రిల్ 4, 2015న జానకిపురం గ్రామ శివారులో ఇద్దరు సిమీ ఉగ్రవాదులు పోలీసులపై కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో అప్పటి ఆత్మకూరు(ఎం) ఎస్‌ఐ సిద్దయ్యతో పాటు అదే పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ చొగోని నాగరాజు అమరులయ్యారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అప్పటి రామన్నపేట సీఐ బాలగంగిరెడ్డి, పోలీసు సిబ్బందికి, ఉగ్రవాదుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో సీఐ బాలగంగిరెడ్డికి గాయాలయ్యాయి. పోలీసు సిబ్బంది జరిపిన కాల్పుల్లో ఇద్దరు సిమీ ఉగ్రవాదులు అస్లాం అయూబ్, జాకీర్ బాదల్ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఎన్‌కౌంటర్ అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఎన్‌కౌంటర్‌కు ముందు రోజు సూర్యాపేట బస్టాండ్‌లో ఉగ్రవాదులు పోలీసులపై కాల్పులు జరిపి పరారయ్యారు. వారి కోసం పోలీసు యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టింది. ఉగ్రవాదులు అర్వపల్లి దర్గా ప్రాంతంలో తలదాచుకొని తిరుమలగిరి మీదుగా మోత్కూరు మండలం చిర్రగూడూరు నుంచి డొంక మార్గం గుండా వెళ్తూ దారితప్పి జానకిపురం గ్రామ శివారుకు చేరుకున్నారు. పోలీసుల నుంచి తప్పించుకోవడానికి బైక్‌పై వెళ్లగా బైక్ వాగులోని ఇసుకలో కూరుకుపోవడంతో మరో బైక్ తీసుకొని గ్రామ శివారులోకి ప్రవేశిస్తుండగా ఎదురుగా వచ్చిన పోలీసు వాహనంపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో డ్రైవర్ సీటులో ఉన్న కానిస్టేబుల్ నాగరాజు అక్కడికక్కడే మృతిచెందగా, ఎస్‌ఐ సిద్దయ్య పొట్ట, తలలోకి తూటాలు దిగడంతో కుప్పకూలిపోయాడు. వారిని హుటాహుటిన హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రెండు రోజుల అనంతరం ఎస్‌ఐ సిద్దయ్య మృతిచెందాడు. తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టిన పోలీసులను యావత్ దేశ ప్రజలు అభినందించారు.

భర్తను చంపిన భార్యకు జీవిత ఖైదు

- రూ.10వేల జరిమానా విధించిన కోర్టు


నిందితురాలు బసవరేఖ

భూదాన్‌పోచంపల్లి: నిత్యం మద్యం తాగి వచ్చి వేధిస్తున్న భర్తను చంపిన భార్యకు సోమవారం భువనగిరి ప్రధాన జిల్లా సెషన్ కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధించింది. ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన బండారి శ్రీనుకు మేనమామ కూతురైన పోచంపల్లికి చెందిన బసవరేఖ(26)ను ఇచ్చి పదేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. జీవనోపాధి నిమిత్తం పోచంపల్లికి వచ్చి అద్దె ఇంట్లో ఉంటూ శ్రీను కేబుల్ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. శ్రీను తన భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకొని మద్యానికి బానిస అయ్యాడు. ప్రతి రోజు మద్యం తాగి వచ్చి భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో 2020, ఫిబ్రవరి 23న భార్యాభర్తలిద్దరూ గొడవ పడ్డారు. దీంతో జరిగిన విషయాన్ని బసవరేఖ తన తల్లిదండ్రులకు చెప్పి ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. అయితే అదే రోజు రాత్రి అత్తవారింటికి వచ్చిన శ్రీను తన పిల్లలను బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా భార్య బసవరేఖ గట్టిగా నెట్టివేయడంతో తల గోడకు తగిలి కిందపడిపోయాడు. ఇదే అదునుగా భావించిన బసవరేఖ శ్రీను ముఖంపై దిండుపెట్టి ఊపిరాడనీయకుండా చేసి హత్య చేసింది. ప్రమాదవశాత్తు చనిపోయాడని నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే మృతుడి అన్న బండారి నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా సోమవారం ఈ కేసు విచారణకు రాగా భువనగిరి ప్రధాన జిల్లా సెషన్ కోర్టు సాక్ష్యాధారాలను పరిశీలించి, నేరం రుజువు కావడంతో నిందితురాలు బసవరేఖకు జీవిత ఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి నిందితురాలికి శిక్ష పడేలా కృషిచేసిన పోలీసులను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, జాయింట్ సీపీ వి. సత్యనారాయణ అభినందిస్తూ వారికి రివార్డును అందజేయనున్నట్లు తెలిపారు.

జాతీయ రహదారిపై ఆయిల్ ట్యాంకర్ బోల్తా

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడింది. వివరాలు.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్(టీఎస్ 09 సీసీ 1083) పెద్దకాపర్తి గ్రామ శివారులోకి రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కొద్దిసేపు హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న జీఎమ్మార్ హైవే సిబ్బంది ట్యాంకర్‌ను పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చిట్యాల పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం


మౌలానా (ఫైల్)

హాలియా: రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం పాలైన ఘటన హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట స్టేజీ శివారులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్‌కు చెందిన రైతు ఎండీ మౌలానా(62), తన కుమారుడు ఎండీ సర్వర్ కలిసి ద్విచక్ర వాహనంపై ఇబ్రహీంపేట స్టేజీ వద్ద కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారి పక్కనే కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న వారి పొలం వద్దకు వెళ్లారు. పొలం వద్ద హైవే పక్కన ఎండీ సర్వర్ ద్విచక్ర వాహనాన్ని ఆపి వరి పొలం కోయడానికి కోత మిషన్ యజమానికి ఫోన్ చేస్తుండగా, జాతీయ రహదారిపై అతివేగంగా వచ్చిన డీసీఎం వాహనం వీరి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎండీ మౌలానా తలకు తీవ్రగాయాలయ్యాయి. కుమారుడు సర్వర్ తన తండ్రి మౌలానాను చికిత్స నిమిత్తం హాలియాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడు సర్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

రైతులకు నష్టపరిహారం అందిస్తాం


రామన్నపేట : కొమ్మాయిగూడెంలో వరిపొలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

రామన్నపేట : అకాల వర్షాలు, వడగండ్ల వానకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సోమవారం మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామంలో మార్చినెలలో కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న వరిచేలు, నిమ్మ తోటలను ఆమె పరిశీలించారు. రైతులు, అధికారులతో మాట్లాడి నష్టం వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఆమె వెంట సర్పంచ్ జెల్లెల లక్ష్మమ్మ పెంటయ్య, తహసీల్దార్ వి.ఆంజనేయులు, వ్యవసాయాధికారి బి.యాదగిరిరావు, విస్తరణాధికారి వెంకన్న, రైతు సంఘం మండల అధ్యక్షుడు ఆనంద్ ఉన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

అంధత్వ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. సోమవారం వెల్లంకి రైతువేదికలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆమె సందర్శించారు. ప్రత్యేకంగా కంటి పరీక్షలు చేయించుకుని నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కంటి పరీక్షల కోసం వచ్చిన స్థానికులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18ఏళ్ల పైబడిన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆమె వెంట శిబిరం అధికారి నరేందర్, కంటి వైద్యురాలు సుమలత, సూపర్‌వైజర్ రమణమ్మ, ఏఎన్‌ఎం పావని, కంప్యూటర్ ఆపరేటర్ సుధీర్, ఆశ కార్యకర్తలు ఎ.సరిత, ఎన్.సుమలత, ఎ.సుగుణ, బి.సంతోష్ ఉన్నారు.

భక్తురాలు పోగొట్టుకున్న పర్సు అప్పగింత


భక్తురాలు మానసకి పర్సు అప్పగిస్తున్న యాదాద్రి ఆలయ ఎస్‌పీఎఫ్ సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చిన ఓ భక్తురాలు పోగొట్టుకున్న పర్సును ఆలయ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్) సిబ్బంది తిరిగి ఆమెకు అప్పగించారు. ఎస్‌పీఎఫ్ సిబ్బంది సోమేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన మానస అనే భక్తురాలు సోమవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో స్వామిని దర్శించుకునేందుకు వచ్చింది. ఈ క్రమంలో తన పర్సును ఆలయ మాఢవీధిలో మర్చిపోయింది. ఆ పర్సును చూసిన ఎస్‌పీఎఫ్ సిబ్బంది ప్రచారశాఖకు వెళ్లి అనౌన్స్‌మెంట్ చేశారు. వెంటనే భక్తురాలు మానస అక్కడి వచ్చి పర్సును తీసుకుంది. ఆ పర్సులో రూ.1,460 నగదు, ఏటీఎం కార్డులు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు ఉన్నాయని, పర్సును అప్పగించిన ఎస్‌పీఎఫ్ సిబ్బందికి భక్తురాలు కృతజ్ఞతలు తెలిపింది.

అక్రమంగా నిల్వ ఉంచిన బెల్లం పానకం ధ్వంసం

మద్దిరాల: మండలంలోని కుక్కడం గ్రామపంచాయతీ పరిధిలోని దస్రూతండాలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన బెల్లం పానకాన్ని సోమవారం ధ్వంసం చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దస్రూతండాకు చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లో బెల్లం పానకం నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు దాడి చేసి సుమారు 200లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఎవరైనా తండాలల్లో సారా తయారుచేస్తే కేసులు నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ హెచ్చరించారు.

'నార్ముల్' పాల సేకరణ ధర పెంపు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీకర్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్: పాల ఉత్పత్తిదారులకు పాల సేకరణ ధరలను పెంచుతూ నార్ముల్ డెయిరీ పాలకవర్గం నిర్ణయించినట్లు నల్లగొండ- రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార యూనియన్ (నార్ముల్) చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హయత్‌నగర్‌లో జరిగిన పాలకవర్గ సమావేశంలో రైతుల సంక్షేమం కోసం పాల సేకరణ ధర పెంచుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు. గేదెపాలు (కిలో వెన్నకు) రూ.756 నుంచి రూ.856కు, ఆవుపాలు (కిలో వెన్నకు) రూ.313 నుంచి రూ.353 పెంచామన్నారు. గేదెపాలు (6శాతం వెన్నకు) లీటరుకు రూ.45 నుంచి రూ.51కు అంటే లీటరుపై రూ.6 పెంచామని తెలిపారు. ఆవు పాలు (3శాతం వెన్నకు) లీటరుకు రూ.35.70 నుంచి రూ.40.25కి అంటే ప్రతి లీటరుపై రూ.4.55 చొప్పున పెంచామని వెల్లడించారు. ఈ పెంపు వెండర్స్ పాలకు వర్తించదని తెలిపారు. పెంచిన ధర ఈ నెల 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. సమావేశంలో సభ్యులు ఎ. గాల్‌రెడ్డి, కె. రాంరెడ్డి, డి. సోమిరెడ్డి, సీహెచ్. వెంకట్రాంరెడ్డి, పి. వెంకట్రాంరెడ్డి, కె. జయశ్రీ, సీహెచ్ సురేందర్‌రెడ్డి, ఆర్. లక్ష్మీనర్సింహారెడ్డి, కె. జలంధర్‌రెడ్డి, కె. అలివేలు, జి. శ్రీధర్‌రెడ్డి, కె. పాండు, జి. రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చందనపల్లిలో చిరుత పిల్లల సంచారం?

- రెండింటిని చూశామంటున్న రైతులు

నల్లగొండ రూరల్: నల్లగొండ మండలం చందనపల్లి గ్రామంలో చిరుతపులి పిల్లలు తిరుగుతున్నట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. దీంతో గ్రామంలో మళ్లీ కలవరం మొదలైంది. మార్చి 29న గ్రామ సమీపంలోని చెత్త డంపింగ్ యార్డు వెనుక భాగంలో 5-6 ఏళ్ల వయస్సు కలిగిన మగ చిరుత పులి మృతదేహం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. రెండు రోజుల నుంచి రెండు చిరుతపులి పిల్లలు సంచరిస్తున్నాయని రైతులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. చిరుత పిల్లలు ఉంటే వాటి తల్లి కూడా ఉండే ఉంటుందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

మామిడి తోటలో సీసీ కెమెరాలు ఏర్పాటు..

మగ చిరుత మరణించిన ప్రాంతానికి సమీపంలోని మామిడి తోటలో పిల్లలు తిరగడం, అనంతరం అవి వరిపొలం గట్టు మీద నుంచి వెళ్తున్నట్టు చూసిన రైతు సమీప గ్రామాల రైతులకు చెప్పినట్టు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. నీటి వసతితోపాటు వరిపొలాలు, మామిడి, బత్తాయి తోటలు, ఇతర చెట్ల పొదలు ఎక్కువగా ఉండటంతో అక్కడే పిల్లలు సంచరిస్తున్నాయనేది గ్రామస్తుల అనుమానం. అయితే రైతుల సమాచారంతో గ్రామానికి వెళ్లిన అటవీ శాఖ అధికారులు దీన్ని నిర్ధారించేందుకు మామిడి తోటలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఐదు రోజుల క్రితం మగ చిరుత మరణించిందని పిల్లలు ఉండే అవకాశం లేదని అధికారులు చెప్పి వెళ్లి పోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గతంలో కూడా కొత్తగూడెం, శేషమ్మగూడెం ప్రాంతాల్లో చిరుతను చూసినట్లు రైతులు చెప్పినా అటవీ శాఖ అధికారులు తేలికగా తీసుకున్నారు. ఇటీవల చిరుత మృతదేహం వెలుగులోకి వచ్చిన తర్వాత అధికారులు నిర్ఘాంత పోయారు.

నిర్దిష్టంగా ఎవరూ చెప్పలేదు: అటవీ శాఖ అధికారి కేఎస్.రెడ్డి

చిరుత పిల్లలను చూసిన వారు ఎవరూ నిర్దిష్టంగా చెప్పలేదని అటవీ శాఖ అధికారి కేఎస్.రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. జిల్లాలో రాచకొండ అటవీ ప్రాంతం దగ్గరగా ఉండడంతో అప్పుడప్పుడూ మర్రిగూడ మండల పరిధిలో కనిపిస్తాయన్నారు. చిరుత పిల్లలను చూసినవారు వెంనే మాకు సమాచారం ఇచ్చినట్లయితే అవి తిరిగిన ప్రాంతంలో వాటి పాద ముద్రలను సేకరించి కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధిని చూసి ఎమ్మెల్యే ఓర్వలేకపోతోంది

- వంగపల్లి గ్రామ సర్పంచ్ ఆరోపణ


వంగపల్లిలో శిలాఫలకాల చిత్రాలను ఫోన్‌లో చూపుతున్న గ్రామ సర్పంచ్ కవిత

యాదగిరిగుట్ట: మండలంలోని వంగపల్లి గ్రామంలో తాను చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఓర్వలేకపోతోందని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆ గ్రామ సర్పంచ్ కానుగు కవిత ఆరోపించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే సొంత గ్రామమైన వంగపల్లిలో అభివృద్ధికి తాను, తన భర్త బాలరాజు అడ్డుపడుతున్నామని ఇటీవల మల్లాపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరోపించారని, అది అవాస్తవమన్నారు. తాను సర్పంచ్‌గా గ్రామంలో డంపింగ్ యార్డు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలను ఏర్పాటు చేశానని, సొంత ఖర్చులతో గ్రామస్తులకు వైకుంఠ రథాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న గొంగిడి సునీత తన సొంత గ్రామానికి ఏమీ చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. 2016లో గ్రామంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు శిలాఫలకాలు వేశారని, అవి ఇప్పటి వరకు కట్టలేదని విమర్శించారు. గ్రామంలో రూ.కోటితో ఫంక్షన్‌హాల్ నిర్మిస్తామంటే పంచాయతీ నుంచి తీర్మానం ఇచ్చినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీపీ చీర శ్రీశైలం, కంఠంగూడెం సర్పంచ్ శ్రీరాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కానుగు బాలరాజుగౌడ్, బందారపు భిక్షపతి, గుండు నర్సింహ పాల్గొన్నారు.

దోపిడీకి పాల్పడిన ఇద్దరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

భువనగిరి: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తుడికి మాయమాటలు చెప్పి దోపిడీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులకు వెల్లడించారు. వికారాబాద్ జిల్లాకు చెందిన పడిగోముల ఎల్లారెడ్డి ఈ నెల 1వ తేదీన యాదగిరిగుట్టకు వచ్చాడు. స్వామివారి దర్శనం అనంతరం 2వ తేదీన తిరిగి ఇంటికి వెళ్లేందుకు యాదగిరిగుట్ట బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఎల్లారెడ్డి బస్సు ఎక్కుతుండగా అతడి వద్ద ఉన్న డబ్బులు ఉండటాన్ని గమనించిన భువనగిరి పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన అలకుంట్ల ఎంజర్, శైలజా అలియాస్ శాలు కూడా అదే బస్సులో ఎక్కారు. ఆ ఇద్దరు ఎల్లారెడ్డికి మాయమాటలు చెప్పి భువనగిరి మండలంలోని సురేంద్రపురి వద్ద బస్సులో నుంచి కిందకు దింపారు. సమీపంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి ఎల్లారెడ్డిని కర్రతో కొట్టి అతడి వద్ద ఉన్న నగదు, మొబైల్ ఫోన్‌ను లాక్కొని పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న భువనగిరి పోలీసులు రూరల్ సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. కాగా సోమవారం రాయగిరి చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా కనిపించిన నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా, నిజం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రూ.28 వేల నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్, పోలీసు సిబ్బంది అశోక్‌రెడ్డి, నరేందర్, శ్రీను, రాజేష్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- పెద్దవూర మండలంలో కారును ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరు..
- త్రిపురారం మండలంలో సైకిల్‌ను పాల వ్యాన్ ఢీకొని మరొకరు..
- బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో కుమారుడు దుర్మరణం, తండ్రికి గాయాలు


నుజ్జునుజ్జయిన కారు


ప్రమాదానికి కారణమైన బస్సు

పెద్దవూర: కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామానికి చెందిన నెల్లూరి మధుసూదన్‌రావు అలియాస్ మధుబాబు(46) నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి అతడు తన భార్య మిర్యాలగూడలోని తల్లిగారి ఇంటి వద్ద ఉండటంతో కల్వకుర్తి నుంచి మిర్యాలగూడకు కారులో బయల్దేరాడు. పెద్దవూర మండలంలోని సంగారం స్టేజీ దాటాక పిన్నవూర గ్రామ శివారులో జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై అకస్మాత్తుగా మతిస్థిమితం లేని మహిళ కారుకు అడ్డుగా రావడంతో ఆమెను తప్పించి ముందుకు వెళ్లగానే ఎదురుగా వస్తున్న కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వస్తూ కారును ఢీకొట్టింది. దీంతో మధుసూదన్‌రావు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య హిమబిందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు.

సైకిల్‌ను పాల వ్యాన్ ఢీకొట్టడంతో..

మోటకొండూర్: సైకిల్‌ని పాల వ్యాన్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని మాటూర్ శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మనబోలు గ్రామానికి చెందిన భిక్షపతి ఆదివారం తన భార్య సత్తమ్మతో కలిసి సైకిల్‌పై వర్టూర్ గ్రామానికి వెళ్లి సాయంత్రం స్వగ్రామం వస్తుండగా మాటూర్ శివారులో ఎదురుగా పాల వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ భిక్షపతిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. సోమవారం మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ట్రాక్టర్ ఢీకొని..


సైదయ్య (ఫైల్)

త్రిపురారం: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో కుమారుడు మృతిచెందగా, తండ్రికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మాటూరు గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. త్రిపురారం ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాగడప గ్రామపంచాయతీకి చెందిన తండ్రీకొడుకులు రేలా నరసింహ, రేలా సైదయ్య(30) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం కూలీ పని కోసం రాగడప నుంచి బెజ్జికల్ గ్రామానికి బైక్‌పై ఇద్దరూ వెళ్తున్నారు. ఈ క్రమంలో అడవిదేవులపల్లి మండలానికి చెందిన ట్రాక్టర్ తుంగపహాడ్ నుంచి అడవిదేవులపల్లి వైపు వెళ్తుండగా మాటూర్ గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బతండా వద్ద వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రేలా సైదయ్య, రేలా నరసింహకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు ఇరువురిని మిర్యాలగూడకు తరలిస్తుండగా మార్గమధ్యలో రేలా సైదయ్య మృతి చెందాడు. రేలా నరసింహ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు రేలా సైదయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రేలా అఖిల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. రాత్రి తోలే ట్రాక్టర్లు పెద్ద పెద్ద సౌండ్ బాక్స్‌లు పెట్టుకొని అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

బావ, బావమరిది మధ్య ఘర్షణ

- తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బావమరిది మృతి

నకిరేకల్: బావ, బావమరిదిని మధ్య జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన బావమరిది ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని చందంపల్లిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లాలోని యండ్లపల్లి గ్రామానికి చెందిన యానాల సాయికుమార్(24) తల్లి భిక్షమమ్మ తన అమ్మగారి ఊరైన నకిరేకల్ మండలంలోని చందంపల్లి గ్రామానికి వచ్చింది. సాయికుమార్ కూడా అమ్మమ్మ ఊరికి వచ్చాడు. ఇటీవల సాయికుమార్ నిత్యం మద్యం సేవిస్తూ తన తల్లి భిక్షమమ్మతో తరచూ గొడవ పడుతున్నాడు. దీంతో భిక్షమమ్మ భర్త సైదిరెడ్డికి, హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో నివాసముంటున్న అల్లుడు యారాల విజయ్‌కుమార్‌రెడ్డికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని తెలిపింది. సోమవారం యారాల విజయ్‌కుమార్‌రెడ్డి తన స్నేహితుడు బాణాల వెంకట్‌రెడ్డిని తీసుకుని చందంపల్లికి వచ్చారు. సాయికుమార్‌కు విజయ్‌కుమార్‌రెడ్డి నచ్చజెపుతుండగా ఇరువురు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో సాయికుమార్‌కు తలకు దెబ్బలు తగలడంతో నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపారు.